
అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 07-11- 2026 సంపుటి : 6 సంచిక : 262 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువ హీరో తేజ



● త్వరలో పెళ్లి పీటలెక్కనున్న యువ హీరో తేజ సజ్జా.. నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో వివాహం!
● తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన నిశ్చితార్థ వేడుకకు ఆహ్వానించిన తేజ సజ్జా.
● పెద్దలు కుదిర్చిన సంబంధానికే ఓకే చెప్పిన యువ హీరో.. తల్లిదండ్రులు చూసిన అమ్మాయితోనే ఏడడుగులు!

2లో

ఓబీసీ క్రీమీ లేయర్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు

● ఓబీసీ రిజర్వేషన్ల క్రీమీలేయర్ నిర్ధారణపై సుప్రీంకోర్టు స్పష్టత
● పాత నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీ జాబితాలకు రక్షణ
● గతంలో పూర్తయిన ఎంపికలను తిరగరాయడానికి వీల్లేదని స్పష్టీకరణ
● ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వేలాది మందికి ఊరట
● పెండింగ్ కేసులను మెరిట్స్ ఆధారంగా పరిష్కరించుకోవచ్చని సూచన



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆంధ్రా అభిమాని



2లో

● కండువా కప్పి పంపిన సీఎం
● ఏపీకి నీళ్లు వదిలినందుకుకృతజ్ఞతగా వచ్చాడని సెటైర్లు
● ఏపీలోని ఆదోని నుంచి హైదరాబాద్‌కు 350 కిలోమీటర్ల పాదయాత్ర
● అభిమానిని కండువా కప్పి సత్కరించిన ముఖ్యమంత్రి
● ఏపీకి కృష్ణా, గోదావరి జలాలు వదిలినందుకే కృతజ్ఞతా?
● తెలంగాణలో పంటలు ఎండబెట్టి.. ఏపీకి నీళ్లు వదిలారంటూ సెటైర్లు
● సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన అభిమాని వీడియో
● 350 కిలోమీటర్లు నడిచి వచ్చిన వ్యక్తికి కనీసం భోజనం, ప్రయాణ ఖర్చులైనా ఇవ్వాలంటూ కామెంట్లు
● రేవంత్ అభిమానిపై నెటిజన్ల ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అభ్యుదయం

ఏపీలోని కర్నూలు జిల్లా ఆదోని నుంచి 350 కిలోమీటర్ల మేర కాలినడకన హైదరాబాద్‌కు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఓ అభిమాని కలుసుకోగా కండువా కప్పి పంపించివేశారు. ఇక్కడ పంటలు ఎండబెట్టి.. ప్రాజెక్టులను పండబెట్టి కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి వదిలేసినందుకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఆంధ్రా అభిమాని ఇక్కడికి వచ్చి రేవంత్‌రెడ్డిని కలిశాడనే సెటైర్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి.

మిగతా 2లో

రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో ఎండిపోయిన పంటలు

● కరువు కోరల్లో చిక్కుకున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
● మహారాష్ట్ర, కర్ణాటక తరహాలో రైతులకు రూ.5 వేల తక్షణ సాయం అందించాలి
● రైతులకు నిధుల్లేవంటూ.. గ్లోబల్ సమ్మిట్‌కు నిధులు ఎలా తెస్తున్నారు?
● పంటల బీమా అమలు చేయకపోవడంతో రైతులకు పరిహారం కరువు
● నీళ్లు ఉన్నా మోటార్లు ఆన్ చేయక పంటలను ఎండబెట్టారు
● మరమ్మతుల పేరుతో 20 టీఎంసీల సింగూరు నీటిని వృథా చేశారు
● బీరు కంపెనీలకు నీళ్లు.. ప్రజలకు తాగునీటి కష్టాలా?
● సింగూరు జలాలను నాలుగు జిల్లాల ప్రజల అవసరాలకే కేటాయించాలి
● కరువు బాధిత రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించా

రోదిస్తున్న రైతును ఓదార్చుతున్న హరీశ్‌రావు, సునీత
రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు నిధుల్లేవంటున్నారు..
గ్లోబల్ సమ్మిట్‌కు, ఫ్యూచర్ సిటీకి నిధులు ఎలా వస్తున్నాయి?
బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఫైర్
మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎండి పోయిన పంటల పరిశీలన

2లో మిగతా



సంగారెడ్డి:అభ్యుదయం రాష్ట్రంలో 25 లక్షల ఎకరాలు ఎండి పోయి రైతులు కరువుతో కొట్టుమిట్టాడుతుంటే గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో రైతులను ఆదుకునే ఒక్క అంశాన్ని కూడా చర్చించకుండా గ్లోబల్ సమ్మిట్‌పై చర్చించడం ఏంటని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల్లో తక్షణ కరువ సహాయంగా ఒక్కో రైతుకు ఆయా ప్రభుత్వాలు రూ.5 వేలు చొప్పున చెల్లించాయని చెప్పారు. కానీ రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు నిధులు లేవంటోందని ధ్వజమెత్తారు. అలాంటప్పుడు గ్లోబల్ సమ్మిట్‌కు, ఫ్యూచర్ సిటీకి, మూసీ సుందరీకరణకు నిధులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఎండి పోయిన పంటలను

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 161 పీజీ సీట్లు మంజూరు

- 2026--27 విద్యా సంవత్సరానికి 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనపు సీట్లు
- 15 వైద్య విభాగాల్లో సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం
- 163 సీట్లకు ప్రతిపాదనలు పంపగా 161 సీట్లకు అనుమతి
- 98.77 శాతం ప్రతిపాదనలకు ఆమోదం లభించడం విశేషం
- బోధనా సిబ్బంది నియామకాలు, మౌలిక వసతుల కల్పనతో పెరిగిన సీట్లు
- మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ
- ఆర్థోపెడిక్స్‌లో 27 సీట్లు మంజూరు
- డీవీఎల్, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున సీట్లు
- రేడియో డయాగ్నోసిస్‌లో 14 సీట్లు.. పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీలో 12 చొప్పున
- జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్‌లో 8 చొప్పున
- ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీలో 4 చొప్పున
- అత్యవసర చికిత్స, క్యాన్సర్ చికిత్స సహా కీలక వైద్య రంగాలకు నిపుణుల బలం
- 2026--27 పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీకి చర్యలు
- డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ వెల్లడి

11 కళాశాలల్లో 15 వైద్య విభాగాల్లో సీట్లకు ఎన్ఎంసీ అనుమతులు
163 సీట్లకు ప్రతిపాదనలు.. 98.77 శాతం సాధన
మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ




అమరావతి,అభ్యుదయం

రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 161 కొత్త పీజీ వైద్య సీట్లను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. మొత్తం 15 స్పెషాలిటీల్లో ఈ సీట్లు వచ్చాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 163 సీట్లకు ప్రతిపాదనలు పంపగా ఎన్ఎంసీ 161 సీట్ల (98.77 శాతం)కు అనుమతించింది. కూటమి ప్రభుత్వం సదరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకాలు, పడకల పెంపు, వైద్య పరికరాలు, మౌలిక వసతులను

మిగతా 2లో

రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం



మురసు తుఫాన్‌తో ప్రాథమికంగా రూ.1,919.59 కోట్ల నష్టం
తక్షణ మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి
కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

2లో

వంద శాతం విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం

● రెండు తుపానులతో విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం
● మురసు తుపానుతో 7,500కు పైగా స్తంభాలు నేలకూలాయి
● మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది సేవలు
● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



2లో

రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో ఎండిపోయిన పంటలు

బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కరువు బారిన పడిన రైతులకు తక్షణం ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల బీమా కోసం బడ్జెట్‌లో రూ.1,600 కోట్లు ప్రకటించి బల్లలు చరిచారని, మూడేళ్లయ్యిందని.. పంటల బీమా ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. పంటల బీమా అమలు చేసి ఉంటే ఇప్పుడు కరువుతో పంట నష్టపోయిన బాధిత రైతులకు పరిహారం అందేదని అన్నారు.



తెలంగాణలో రేవంత్ వృష్టి..

అతివృష్టి.. అనావృష్టి.. ఉంటాయి.. కానీ రాష్ట్రంలో వచ్చింది ముమ్మాటికీ రేవంత్ వృష్ట?టనని హరీశ్‌రావు అన్నారు. దేవాదులలో 60 టీఎంసీలు ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నప్పటికీ కేవలం 18 టీఎంసీలకే పరిమితం చేసి చంద్రబాబుకు వదిలేయడమే ఇందుకు ఉదాహరణ అని వివరించారు. మహబూబ్‌నగర్‌లో కృష్ణా నీటిని కూడా అలాగే దిగువకు వదిలేశారని విమర్శించారు. నదుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నా మోటార్లు ఆన్ చేయకుండా పంటలు ఎండబెట్టిన అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ అని విమర్శించారు. మరమ్మతుల పేరుతో 20 టీఎంసీల సింగూరు నీటిని నదిలోకి వదిలేసి సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల వాసులకు తాగునీరు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మరమ్మతు పనులను కనీసం పది శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రజల తాగునీటి అవసరాలకు నీళ్లు ఇవ్వని ప్రభుత్వం, బీరు కంపెనీలకు మాత్రం పుష్కలంగా నీటిని సరఫరా చేస్తోందని విమర్శించారు.

సింగూరు నీళ్లను ఆ నాలుగు జిల్లాలకే ఇవ్వాలి..

నీటి మట్టం రెండు టీఎంసీలకు పడిపోయిన నేపథ్యంలో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి, సింగూరు నీటిని సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకే పరిమితం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తక్షణం బీరు ఫ్యాక్టరీలకు నీటి సరఫరా నిలిపివేసి, ప్రజల గొంతులు తడపాలని అన్నారు. కరువుతో కష్టాల పాలైన రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సునీతారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

'కూటమి అరాచక పాలనపై ప్రజల తిరుగుబాటు తప్పదు'

అనంతపురం : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా కేవలం పోలీసుల లాఠీలు, అక్రమ నిర్బంధాలతో పూర్తిగా ప్రహసనంగా మార్చేసిందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా బలవంతంగా పత్రాలు లాక్కోవడం, వేసిన నామినేషన్లను అధికారులతో కుమ్మక్కై తిరస్కరించడం, పోలింగ్ ఏజెంట్లను, ముఖ్య నాయకులను రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి ఏకపక్షంగా రిగ్గింగ్‌లకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలుగుదేశం పార్టీకి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగిన ఎన్నిక కాదని, ప్రజల స్వేచ్ఛా హక్కులపై అధికార మదంతో ప్రభుత్వం కాకీ చొక్కాలను అడ్డుపెట్టుకుని చేసిన దాడి అని ఆయన స్పష్టం చేశారు.

నామినేషన్ల అపహరణ.. అధికారులతో తిరస్కరణ..

పెద్ద ఎత్తున అభ్యర్థుల చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు బలవంతంగా లాక్కోవడం నీకే చెల్లింది చంద్రబాబూ?. నామినేషన్లను అడ్డుకోవడం ద్వారా మీరు వేలాది స్థానాల్లో ఏకగ్రీవాలు చేసుకుని మీరు అనుకున్న ప్రగతిని సాధించారు. ఇక ధైర్యం చేసి వేసిన నామినేషన్లలో కూడా కనీసం 30 శాతం నామినేషన్లను మీ అనుకూల ఆర్వోలతో స్క్రూటినీలో కావాలని రిజెక్ట్ చేయించారు. వేలాది సంఖ్యలో ఈ విధమైన అక్రమాలకు పాల్పడ్డారు.

అక్రమ కేసులు, బెదిరింపు నోటీసులు

ఎన్నికల కంటే ముందే వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై అడ్డగోలుగా అక్రమ కేసులు బనాయించారు. ప్రచారాల సందర్భంలోనూ తప్పుడు కేసులు పెట్టి, బైండోవర్లకు కట్టుబడి లేరంటూ ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు వసూలు చేస్తామని బెదిరింపు నోటీసులు జారీ చేసి భయాందోళనలు సృష్టించారు.

రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం

అమరావతి, వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, మురసు తుఫాన్ కారణంగా ప్రాథమికంగా రూ.1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు వరుస తుఫాన్ల కారణంగా ఏపీపై తీవ్ర ప్రభావం పడిందని సీఎం పేర్కొన్నారు. భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా విద్యుత్, రహదారుల లాంటి మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయని వివరించారు. అక్టోబరు 27 తేదీన అర్ణబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే మురసు తుఫాన్ విరుచుకు పడటంతో రైతులు, మత్స్యకారులు ఒకే సీజన్‌లో రెండుసార్లు నష్టపోయారని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలు నిర్వహించి మరో 15 రోజుల్లో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

తక్షణ సాయంతో రాష్ట్రానికి ఉపశమనం:

మురసు తుఫాన్ కారణంగా వ్యవసాయ రంగంలో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు ప్రభావితం అయ్యారని ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లిందని, ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులు నష్ట పోయారని తెలిపారు. ఈ రంగానికి రూ.337.10 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. దీంతో పాటు పశుసంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య శాఖల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో కొంత మేర ఆస్తి నష్టాన్ని తగ్గించ గలిగామని వివరించారు. మురసు తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, గృహాలు దెబ్బతిన్న కుటుంబాలు, ఇతర బాధిత వర్గాలను ఆదుకోవడానికి, రాష్ట్రంలో దెబ్బతిన్న అత్యవసర మౌలిక సదుపాయాలు, సేవలను పునరుద్ధరించడానికి కేంద్ర హోం శాఖ తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

వంద శాతం విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యం

అద్దంకి,అర్ణబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతు, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శనివారం సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు తుపాన్ల కారణంగా విద్యుత్ శాఖకు రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు. మంత్రి శుక్రవారం అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి తుపాను నష్టాన్ని పరిశీలించారు. జె.పంగులూరు మండలంలోని ముప్పవరం, కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్లపాడు, అలవలపాడు గ్రామాలతో పాటు కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు, కొరిశపాడు, కుర్రవానిపాలెం, రావినూతల గ్రామాలను సందర్శించారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.ముప్పవరంలో దెబ్బతిన్న మామిడి తోటలను, కొండమంజులూరులో ధ్వంసమైన నర్సరీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కోటపాడులో కూలిన ఇళ్లు, పశువుల కొట్టాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. తూర్పు తక్కెళ్లపాడులో పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను చూశారు. తుపాను నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు.

పొగాకు సహా పలు పంటలకు నష్టం:

తుపాను ప్రభావంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఉసిరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు, అద్దంకి, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పొగాకు పంటకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో పొగాకు బ్యార్నీలు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాన్ని నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

నల్లమడ వాగు గేట్లు దెబ్బతిన్నాయని, వాటి కారణంగా నీటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పంట పొలాల్లోకి వరద నీరు చేరకుండా నియంత్రించడంతోపాటు, వరద వచ్చినప్పుడు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.



రైతులు పడిన కష్టానికి ఫలితం దక్కేలా పని చేస్తున్నాం:

రేటూరు గ్రామంలో నడుచుకుంటూ వెళ్లిన ముఖ్యమంత్రి... వరద నీటిలో మునిగిపోయిన వరి చేలను పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూనే రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాన్ వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం ఎంత పెట్టుబడి పెట్టారు? పంటల బీమా చేయించుకున్నారా? అనే విషయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని వివరించారు. పంటల బీమాపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించడంతో పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వచ్చే సమయంలో మురసు తుఫాన్ నష్టాన్ని మిగిల్చిందని చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నష్టాన్ని చాలావరకు నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు వాటిని తేలిగ్గా తీసుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ... వేగంగా పునరుద్ధరణ:

తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిలో కొంత మేర ఉపశమనం కలుగుతుందని చెప్పారు. రైతుల పంట నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం అందుతోందా లేదా...

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 161 పీజీ సీట్లు మంజూరు

కల్పించడం ద్వారా 161 సీట్లు అదనంగా రావడంతో మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువైంది.

ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు:

వైద్య విభాగాల వారీగా ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు మంజూరయ్యాయి. చర్మ, సుఖ వ్యాధుల విభాగం (డీవీఎల్), ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున, రేడియో డయాగ్నోసిస్ 14, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ విభాగాల్లో 12 చొప్పున, జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాల్లో 8 చొప్పున, ఎమర్జెన్సీ మెడిసిన్, ప్రసూతి, గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో 4 చొప్పున సీట్లు లభించాయి. ఎమర్జెన్సీ మెడిసిన్, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో మంజూరైన సీట్లు అత్యవసర చికిత్స, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స వంటి ప్రాధాన్య రంగాల్లో వైద్య నిపుణుల సంఖ్యను పెంచనున్నాయి. ప్రస్తుతం మంజూరైన 161 సీట్లను 2026--27 విద్యా సంవత్సర పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

కిందటి విద్యా సంవత్సరంలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి మొత్తం 150 పీజీ వైద్య విద్య సీట్ల మంజూరుకు దరఖాస్తులు వెళ్లాయి. వీటి పరిశీలన అనంతరం ఎన్ఎంసి 142 సీట్లను మంజూరు చేసింది.

ఓబీసీ క్రీమీ లేయర్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ,ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లకు సంబంధించి క్రీమీ లేయర్ నిర్ధారణపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ ఏడాది మార్చి 11న ఇచ్చిన జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఆర్. మాహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన సంచలన తీర్పుపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. కేంద్రం దాఖలు చేసిన వివరణ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పిచ్చింది. ఈ తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా ఉద్యోగులు, అభ్యర్థుల్లో నెలకొన్న తీవ్ర గందరగోళానికి తెరపడింది.

మార్చి 11న ఇచ్చిన తీర్పు వల్ల గతంలో ఎప్పుడో పూర్తయిన నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీ జాబితాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సుప్రీంకోర్టు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఆర్. మాహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. పాత నియామకాలను తిరగరాయడానికి ఈ తీర్పును కారణంగా చూపరాదని తేల్చిచెప్పింది. దీంతో ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వేలాది మంది ఉద్యోగులకు పూర్తి రక్షణ లభించినట్టయింది. అలాగే వివిధ కోర్టులు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి కేసులను సంబంధిత న్యాయస్థానాలు వాటి మెరిట్స్ ఆధారంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వానికి స్వేచ్ఛ:

ప్రభుత్వ ఉద్యోగాలతో సమానమైన హోదాలను పీఎస్‌యూలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల్లో గుర్తించేందుకు రెండేళ్ల గడువు కావాలని కేంద్రం కోరినప్పటికీ, దానికి నిర్దిష్ట గడువు పెట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇలాంటి విధానపరమైన నిర్ణయాలు, చట్టాల రూపకల్పన పూర్తిగా కేంద్ర ప్రభుత్వం, చట్టసభల పరిధిలోని అంశాలని స్పష్టం చేస్తూ, ఓబీసీ క్రీమీ లేయర్‌పై కొత్త పాలసీని రూపొందించుకునే పూర్తి స్వేచ్ఛ కేంద్రానికి ఉందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.ం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యువ హీరో తేజ సజా

హనుమాన్', 'మిరాయ్' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తేజ సజ్జా. ఈ యువ హీరో త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఇప్పటికే తన పెళ్లి విషయాన్ని స్వయంగా వెల్లడించాడు. ఇప్పుడు ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వానాలను అందించే పనిలో ఉన్నాడు. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన నిశ్చితార్థ ఆహ్వానాన్ని అందించారు. ఈ మేరకు సీఎంని ?కలిసిన ఫొటోలు వైరల్‌గా మారాయి.అయితే తేజ సజ్జా వివాహం పెద్దలు కుదిర్చిన సంబంధమని గతంలోనే స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులు చూసిన అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యానని వెల్లడించారు. నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో వివాహ వేడుక జరగనున్నట్లు తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లిని నిర్వహించాలనుకుంటున్నట్లు చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆంధ్రా అభిమాని

అభిమానికి రేవంత్ కండువా కప్పి పంపిన వీడియోను సోషల్ మీడియాలో చూసి పలువురు కామెంట్లు పెట్టారు. 'అతను 350 కిలోమీటర్లు నడిచి వస్తే కనీసం భోజనం.. తిరుగు ప్రయాణ టికెట్ అయినా ఇచ్చి ఉండాల్సింది. 'తెలంగాణ విముక్తి పోరాటంలో మీ పాత్ర లేనందున సీమ సోదరుడు అభిమానాన్ని పెంచుకొని ఉంటాడేమో ' అని మరొకరు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు.

కరాచీ సమీపంలో లష్కరే ఉగ్రవాదులకు శిక్షణ..



పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా మరోసారి సముద్ర మార్గంలో దాడులకు సిద్ధమవుతోందా? నిఘా వర్గాల నుంచి వెలువడిన తాజా సమాచారం ఈ అనుమానాలను పెంచుతోంది. కరాచీకి సమీపంలోని చర్నా ద్వీపంలో లష్కరే ఉగ్రవాదులకు సముద్ర కార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం. ఈ శిక్షణను పర్యాటక కార్యకలాపాల ముసుగులో నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. స్కూబా డైవింగ్, కాంబాట్ స్విమ్మింగ్, నీటి అడుగున కార్యకలాపాలకు సంబంధించిన నైపుణ్యాలను వారికి నేర్పిస్తున్నట్లు సమాచారం 'పాకిస్థాన్‌లోని కరాచీకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో చర్నా ద్వీపం ఉంది. ప్రకృతి అందాలకు, సముద్రంలో సాహస క్రీడలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా స్కూబా డైవింగ్, స్నార్కెలింగ్ కోసం పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇలాంటి ప్రాంతాన్ని ఎంచుకుని పర్యాటకుల ముసుగులో శిక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ శిక్షణ కార్యక్రమాల్లో పాకిస్థాన్‌కు చెందిన మార్కజీ ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) సభ్యులు శిక్షకులుగా వ్యవహరిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి

2008 నవంబర్ 26న లష్కరే తోయిబాకు చెందిన పది మంది ఉగ్రవాదులు సముద్ర మార్గంలో ముంబైకి చేరుకుని దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో కూడా ఉగ్రవాదులకు పాకిస్థాన్‌లోని మంగ్లా డ్యామ్ వద్ద శిక్షణ ఇచ్చినట్లు వెల్లడైంది. ఇప్పుడు మరోసారి సముద్రకార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ జరుగుతున్నట్లు సమాచారం రావడం భారత భద్రతా సంస్థల్లో ఆందోళన కలిగిస్తోంది. సముద్ర మార్గం ద్వారా ఎదురయ్యే ముప్పుపై భారత భద్రతా సంస్థలకు పూర్తి సమాచారం ఉందని, ఎలాంటి ప్రమాదం ఎదురైనా తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని నిఘా వర్గాలు తెలిపాయి (26/11 వీబఎఘ్ఖఅ ఙ్ఖఎం).మరోవైపు, జమ్మూకశ్మీర్‌లో కూడా లష్కరే తోయిబా కార్యకలాపాలపై అధికారులు దృష్టి సారించారు. యువతను సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షించి ఉగ్రవాదంలోకి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ కశ్మీర్ అధికారులు ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డిజిటల్ పరికరాలు, పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నేను సీడబ్ల్యూసీ మెంబర్‌ను..!

ఆఫ్టాల్ టీపీసీసీ పిలిస్తే విచారణకు వస్తానా?



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృ జ్వాలలు కొనసాగుతూనే ఉన్నాయి. మొన్న ఢిల్లీ శాంగ్రిలా హోటల్‌లో తాగి తన్నుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిరిచ్చేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిన్న గాంధీ భవన్‌కు విచారణకు పిలిచాడు.అయితే మహేష్ కుమార్ గౌడ్ స్థాయి ఏంటో తెలుసుకోవాలని, సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడిని టీపీసీసీ విచారణకు పిలవడం ఏంటని దామోదర రాజనర్సింహ తన సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే నిన్న విచారణకు హాజరు కాలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దామోదర రాజనర్సింహ విచారణకు హాజరు కాకపోవడంతో తానెందుకు విచారణకు రావాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సైతం డుమ్మా కొట్టారు. ఇద్దరూ రాకపోవడంతో చేసేదేమీ లేక మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ నుంచి నిరాశగా వెళ్లిపోయాడు.

గుడ్‌న్యూస్.. ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ధరలు భారీగా తగ్గాయి!

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలకు దీపావళి కానుకగా ప్రభుత్వం తీపి కబురు అందించింది. నిత్యం మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఊరట కలిగించేలా ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించింది.ఇప్పటివరకు రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర రూ.400 ఉండగా.. దాన్ని రూ.275కు కుదించింది. అలాగే నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి ఏకంగా రూ.4,000కు తగ్గించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు, అలాగే, తగ్గించిన ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నట్లుగా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. అయితే, రోజువారీ పాస్ ధర తగ్గింపుతో ప్రయాణికులకు రూ.125 మేర ప్రయోజనం చేకూరనుంది. ఈ పాస్‌లో మెట్రో ప్రయాణానికి రూ.200, ఆర్టీసీ ప్రయాణానికి రూ.75 కేటాయించారు. దీంతో రోజుకు నాలుగు సింగిల్ జర్నీలు చేసేందుకు అనుమతి ఉంటుంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల కోసం నిత్యం ప్రయాణించే వారికి ఈ నిర్ణయం ఉపయోగకరంగా ఉండనుంది.

ఇక నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధర తగ్గింపుతో వినియోగదారులకు ఏకంగా రూ.4,500 ఆదా కానుంది. రూ.8,500 చెల్లించాల్సిన పాస్ ఇకపై రూ.4,000కే అందుబాటులోకి రానుంది. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ.3,000, ఆర్టీసీ ప్రయాణానికి రూ.1,000 కేటాయించారు. నెలవారీ పాస్‌తో గరిష్ఠంగా 50 మెట్రో సింగిల్ ట్రిప్పులకు అనుమతి ఉంటుంది. అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఎలాంటి పరిమితులు విధించలేదు.

ఈ సందర్భంగా ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా వినియోగించుకునేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని వారు అన్నారు. ఈ క్రమంలో రోజువారీ, నెలవారీ పాస్‌ల ధరలు తగ్గించడంతో సామాన్యులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గనుంది. ముఖ్యంగా మెట్రో, ఆర్టీసీ సేవలను కలిపి వినియోగించుకునే ప్రయాణికులకు ఈ దీపావళి కానుక ఎంతో ఊరటనివ్వనుంది.

నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?..

'మాజీ భార్య' ట్యాగ్‌పై నటి రేణు దేశాయ్ ఆవేదన



నటి, నిర్మాత రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. విడాకులు తీసుకుని సుమారు 14 సంవత్సరాలు గడిచినా, సమాజం తనను కేవలం పవన్ కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తోందని.. తనకంటూ ఒక స్వతంత్ర గుర్తింపు ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితంలోని కష్టాలు, ఎదుర్కొంటున్న ట్రోలింగ్‌పై కన్నీటి పర్యంతమయ్యారు.ఈ సందర్భంగా రేణు దేశాయ్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలందరికీ నేను ఒకటే చెప్పాలనుకుంటున్నాను. చాలామంది నా జీవితం 'బద్రి' సినిమాతోనే ప్రారంభమైందని భావిస్తారు. అంతకుముందు నాకు ఎలాంటి జీవితమే లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మాకు అధికారికంగా విడాకులు వచ్చి 14 ఏళ్లు పూర్తయ్యాయి. శ్రీరాముడు కూడా 14 ఏళ్లు మాత్రమే వనవాసం చేశాడు. మరి నా ఈ మానసిక క్షోభ, వనవాసం ఎప్పుడు ముగుస్తుంది? అంటూ తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు.తన సొంత ప్రతిభ, విజయాల గురించి ప్రస్తావిస్తూ.. 2012లో విడాకులు తీసుకున్న తర్వాత నేను కేవలం ఖాళీగా కూర్చోలేదు. సొంతంగా ఒక మరాఠీ సినిమాను నిర్మించాను, అది బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది.

ఆ తర్వాత మరో చిత్రానికి కథ అందించడంతో పాటు దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు కూడా నేనే స్వయంగా నిర్వహించాను. అంతేకాకుండా, పలు టీవీ డ్యాన్స్ షోలకు పనిచేశాను, కవితలు రాశాను, ఇప్పుడు మళ్లీ సినిమాల్లో నటిస్తున్నాను. నాకంటూ ఎలాంటి వ్యక్తిగత గుర్తింపు, టాలెంట్ లేకపోతే నాకు ఇన్ని రంగాల్లో అవకాశాలు ఎందుకు వస్తాయి? అని ఆమె ప్రశ్నించారు. సమాజంలో కొందరు వ్యక్తులు ఆయన లేకపోతే అసలు ఆమెకు బతికే అర్హతే లేదు అన్నట్లుగా మాట్లాడుతుంటారు. ఇతరుల జీవితాలను విమర్శించే ముందు కాస్త ఆలోచించాలి అని ఆమె పేర్కొన్నారు.

ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాల్సిందే.. హరీశ్‌రావు డిమాండ్



కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ కోతల కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్, హత్నూర మండలాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నా కనీసం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని హరీశ్ రావు ఎదుట వాపోయారు. రైతుబంధు పథకం కింద పూర్తిస్థాయిలో సాయం అందలేదని, కేవలం ఒక్క ఎకరానికే డబ్బులు వేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ కూడా బోగస్ అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో పది మందిలో కనీసం ఒక్కరికైనా రుణమాఫీ కాలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఇతగబచ్చిన హామీలను నమ్మి మోసపోయామని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తమ కష్టాలు తీరుతాయని హరీశ్ రావు వద్ద పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వెల్లడించింది

.ఈ సందర్భంగా హరీశ్ రావు రైతులకు ధైర్యం చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని, రానున్న రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి మెడలు వంచి రైతుల సమస్యలను పరిష్కరించేలా పోరాడతామని భరోసా ఇచ్చారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను విడుదల చేయడంతోపాటు రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటే మేలు

అప్పుడే బాధ్యత తెలుస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్య
పంజాబ్ ప్రధాన కార్యదర్శిపై కేసు కొట్టివేత
ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ బకాయిలపై వివాదం
ధిక్కరణ కేసు నమోదుకు హైకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై కాంట్రాక్ట్ పద్ధతిలోనే రావాలి. అప్పుడే వారు బాధ్యతగా వ్యవహరిస్తారు"అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది.

ఇందులో ఒక పిటిషన్ పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ బకాయిల చెల్లింపులకు సంబంధించినది. ఈ కేసులో హైకోర్టు పంజాబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏ.పీ సిన్హాపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ బకాయిలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన మరో ఆదేశాన్ని సవాలు చేస్తూ ఇంకో రెండు పిటిషన్లు కూడా సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి.

మూడింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు పంజాబ్ ప్రధాన కార్యదర్శి సహా పలువురు అధికారులపై క్రిమినల్ ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ కేసు విచారణను నిలిపివేస్తూ తీర్పునిచ్చింది. ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుపై ఇచ్చిన హైకోర్టు ఆదేశాలనూ కొట్టివేసింది. పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తేనే వారికి నిజమైన బాధ్యత ఉంటుంది"అని వ్యాఖ్యానించింది.

ప్రస్తుతం పంజాబ్‌లో ఉన్న ప్రభుత్వం దాదాపు రూ.13,000 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పొందిందని రాష్ట్రం తరపు న్యాయవాది బెంచ్ దృష్టికి తీసుకురాగా.. వచ్చే ఏడాది మార్చిలోగా ఎంత మొత్తం విడుదల చేయగలరో తెలపాలని కోరింది. "మీకు కొంత వెసలుబాటు ఇస్తున్నాం. సానుకూలంగా స్పందించండి"అని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను డిసెంబరు ఒకటవ తేదీకి వాయిదా వేసింది. ఆగస్టు మూడవ తేదీన హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిల వివాదం ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్--హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కీలక మలుపు తిరిగింది. డీఏ బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం సూచించిన ప్రణాళికను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తిరస్కరించింది. జూన్ 30లోపు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు వర్తించే రేట్ల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలన్నీ విడుదల చేయాలని ఆదేశించింది. పంజాబ్ ప్రభుత్వం, పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ఆదేశాలను డివిజన్ బెంచ్ ముందు సవాలు చేశాయి. డివిజన్ బెంచ్ ఆగస్టు 3న ప్రభుత్వం అప్పీళ్లను కొట్టివేసింది. రెండు వారాల్లో బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా, బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు పత్రికలు, సోషల్ మీడియా వంటి మాధ్యమాల్లో భారీ ప్రకటనలపై ఖర్చులు చేయవద్దని కూడా స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు అమలు కాలేదని ఉద్యోగులు, పెన్షనర్లు కొందరు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అక్టోబర్ 12న, ప్రధాన కార్యదర్శి కేఏపీ సిన్హాకు నోటీసు జారీ చేసింది. క్రిమినల్ ధిక్కరణ చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో చెప్పాలని, వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే సివిల్ ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు క్రిమినల్ కాంటెంప్ట్ చర్యలు ప్రారంభించడం సరికాదని వాదించారు.

తూర్పుపల్లి పోలింగ్ స్టేషన్ 25లో పోలింగ్ శాతం రికార్డు

నెల్లూరు: మండలంలోని తూర్పుపల్లి పోలింగ్ స్టేషన్ 25లో పోలింగ్ శాతం రికార్డు బద్దలు కొట్టింది. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో కూటమి నేతలు, పోలింగ్ అధికారులు ఏకంగా 104.27 శాతం పోలింగ్ నిర్వహించి చరిత్ర సృష్టించారు. గురువారం పోలింగ్‌కు ముందు మంత్రి ఆనం తన అనుచరులకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు నెట్టేసి రిగ్గింగ్ చేయాలని ఆదేశించారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు బరితెగించి చేసిన రిగ్గింగ్ బట్టబయలైంది. తూర్పుపల్లిలోని పోలింగ్ స్టేషన్ 25లో మొత్తం ఓటర్లు 586 మంది ఉన్నాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ తరపున కూర్చున్న ఎన్నికల ఏజెంట్లను తొలి గంటలోనే బయటకు తరిమేశారు. ఆ తరువాత కూటమి నేతలు ఓటరు జాబితాలో ఉన్న అందరి ఓట్లను చనిపోయిన ఓటర్లతో సహా ఓటు వేసినట్లు బ్యాలెట్ బాక్స్‌లో నింపారు. కూటమి నేతలు అంతటితో తృప్తి తీరక అదనంగా మరో 25 బ్యాలెట్లను కూడా బాక్స్‌లో వేశారు.

సీజ్ చేసిన అక్రమ నిర్మాణం మళ్లీ ఎలా వెలుగులోకి వచ్చింది?

7వ ఫేస్‌లో అధికారుల చర్యలు ఏమయ్యాయి? ప్లాట్ నంబర్ 531పై అంతులేని ప్రశ్నలు!

అభ్యుదయం – కూకట్‌పల్లి (నవంబర్ 06):
కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో అక్రమ నిర్మాణాలపై అధికారుల చర్యలు కేవలం నోటీసులకే పరిమితమవుతున్నాయా? నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాల విషయంలో అధికారులు ఒకసారి సీజ్ చేసి, ఆ తర్వాత ఎందుకు మౌనం వహిస్తున్నారు?

7వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ ఎల్ ఐ జి 531 ఇప్పుడు ఇదే ప్రశ్నలకు కేంద్రంగా మారింది.

ఒకప్పుడు సీజ్... ఇప్పుడు పరిస్థితి ఏమిటి?

స్థానికంగా అందిన సమాచారం ప్రకారం, ప్లాట్ నంబర్ 531లో చేపట్టిన నిర్మాణం గతంలో భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా ఉందన్న కారణంతో మున్సిపల్ అధికారులచే సీజ్ చేయబడింది.
నిర్మాణానికి ++2 అనుమతి ఉండగా, ఐదు అంతస్తుల వరకు నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.అప్పట్లో అధికారులు స్పందించి సీజ్ చర్యలు తీసుకున్నప్పుడు అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట పడిందని స్థానికులు భావించారు.
కానీ ఇప్పుడు అదే నిర్మాణం విషయంలో పరిస్థితి ఏమిటి? సీజ్ చేసిన భవనంపై తదుపరి చర్యలు ఎందుకు కనిపించడం లేదు? సీజ్ ఉత్తర్వులు ఇంకా అమలులో ఉన్నాయా? వాటిని తొలగించడానికి అధికారిక అనుమతి ఇచ్చారా?ఈ ప్రశ్నలకు సంబంధిత మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

అధికారుల మౌనం వెనుక కారణం ఏమిటి?

ఒక భవనాన్ని అక్రమ నిర్మాణంగా గుర్తించి సీజ్ చేసిన తర్వాత, అదే భవనంపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదే.
మరి ఇప్పుడు ఎందుకు చర్యలు కనిపించడం లేదు?

భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు సవరించబడ్డాయా?

లి అదనపు అంతస్తులకు చట్టబద్ధమైన అనుమతులు పొందారా?
లి గతంలో విధించిన సీజ్ ఉత్తర్వులను అధికారికంగా ఎత్తివేశారా?
లి సీజ్ చేసిన భవనం తిరిగి వినియోగంలోకి వస్తే





దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు అందినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు?

ఇవి కేవలం స్థానికుల సందేహాలు మాత్రమే కాదు. పట్టణ ప్రణాళిక, భవన నిర్మాణ నిబంధనలు, అధికారుల జవాబుదారీతనానికి సంబంధించిన కీలక ప్రశ్నలు.

అక్రమ నిర్మాణాలకు అండ ఎవరిది?

నగరంలో సామాన్య ప్రజలు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే అనేక అనుమతులు, నిబంధనలు, తనిఖీలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
కానీ నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు చేపట్టి, ఆ తర్వాత కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించే పరిస్థితి ఉంటే అది వ్యవస్థలోని లోపాలను బయటపెడుతుంది.
ఇంటి పరిస్థితులు అధికారుల నిర్లక్ష్యమా? పర్యవేక్షణ లోపమా? లేక ఎవరి ఒత్తిళ్లైనా పనిచేస్తున్నాయా?
అధికారులపై అవినీతి లేదా కుమ్మక్కు ఆరోపణలు చేయడానికి ముందు వాస్తవాలు, రికార్డులు బయటకు రావాలి. అయితే అలాంటి అనుమానాలకు తావులేకుండా సంబంధిత అధికారులు పారదర్శకంగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉంది.

మున్సిపల్ అధికారులకు అభ్యుదయం ప్రశ్నలు

1. ప్లాట్ నంబర్ 531 నిర్మాణానికి వాస్తవంగా ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది?
2. +o2 అనుమతితో ఐదు అంతస్తుల నిర్మాణం జరిగిందన్న ఆరోపణలపై విచారణ జరిగిందా?
3. గతంలో భవనాన్ని సీజ్ చేసిన తేదీ, ఉత్తర్వుల వివరాలు ఏమిటి?
4. ప్రస్తుతం ఆ సీజ్ ఉత్తర్వులు అమలులో ఉన్నాయా? ఎత్తివేస్తే ఏ ప్రాతిపదికన ఎత్తివేశారు?
5. అక్రమ నిర్మాణంగా గుర్తించినట్లయితే ఇప్పటివరకు ఎందుకు తుది చర్యలు తీసుకోలేదు?
6. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు విచారణ చేపడతారా?

ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే!

నగరాభివృద్ధి అంటే కేవలం భవనాలు పెరగడం కాదు. చట్టబద్ధమైన నిర్మాణాలు, ప్రజల భద్రత, నిబంధనల అమలు కూడా అంతే ముఖ్యం.
ఒకప్పుడు సీజ్ చేసిన భవనం విషయంలో నేడు ఏం జరుగుతోంది? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు ఎప్పుడు?సెమంతి ఫేస్ ప్లాట్ నంబర్ 531 వ్యవహారంపై సంబంధిత మున్సిపల్ అధికారులు పూర్తి వివరాలతో ప్రజల ముందుకు రావాలి.
సీజ్ ఒకరోజు చర్యగా మిగిలిపోవాలా? లేక అక్రమ నిర్మాణాలపై చట్టం తన పని తాను చేసుకుపోవాలా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది సంబంధిత అధికారులే!

అభ్యుదయం -- ప్రజల పక్షాన... ప్రశ్నించే గొంతుక!

ఖైత్లాపూర్ జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో బరితెగించిన కబ్జాదారులు!

ఉమ్మడి స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి.. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!

- 250 అడుగుల ప్లాట్లు 600 అడుగుల
- విస్తరణ.. అడ్డగోలుగా కమర్షియల్ షట్టర్లు
- గజం రూ. 2 లక్షలు పలికే ప్రాంతంలో సర్కారు స్థలానికి పక్కా ఎసరు
- పాత జీ+2 భవనాలను లీడెవలప్ చేసి జీం9 టవర్లు నిర్మిస్తే.. వేలాది పేదలకు పక్కా ఇళ్లు!

అభ్యుదయం – ఖైత్లాపూర్ (కూకట్‌పల్లి) నవంబర్ 06: రాష్ట్ర రాజధాని నడిబొడ్డున పేదల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ గృహ సముదాయాలు కొందరు అక్రమార్కుల స్వార్థానికి కరిగిపోతున్నాయి. కూకట్‌పల్లి నియోజక వర్గ పరిధిలోని ఖైత్లాపూర్ జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో ఉమ్మడి స్థలాలు, కారిడార్లు, ఖాళీ భూముల ఆక్రమణలు పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి సర్వే నిర్వహించకపోతే, భవిష్యత్ అవసరాలకు పనికివచ్చే విలువైన ప్రభుత్వ భూమి పూర్తిగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

అభ్యుదయం ప్రత్యేక పరిశోధనాత్మక కథనం 2

ఒక్క బెడ్‌రూమ్ పోయి.. మూడు గదుల భవనాలు!

గతంలో పేద కుటుంబాలకు జీం2 పద్ధతిలో 250 నుంచి 280 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే ప్లాట్లు కేటాయించారు. అయితే కాలక్రమంలో స్థానిక నాయకుల అండదండలతో కొందరు నివాసితులు పక్కనున్న ఖాళీ స్థలాలను, కామన్ ఏరియాలను కలిపేసుకుని 500 నుంచి 600 చదరపు అడుగుల మేర ఇళ్లను విస్తరించుకున్నారు. మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్ ఫ్లోర్లలో కమర్షియల్ షట్టర్లు వేసి వ్యాపార కేంద్రాలుగా మార్చేశారు. ఫలితంగా రోడ్లు ఇరుగ్గా మారి, అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు కూడా రాలేని దుస్థితి నెలకొంది.

కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవు:

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి:
సర్వే ఉ ల్యాండ్ గ్రాబింగ్ కేసులు: కాలనీలోని ప్రతి బ్లాక్‌లో మూల నమూనా (ఒరిజినల్ ప్లాన్) ప్రకారం సమగ్ర సర్వే జరపాలి. ఉమ్మడి స్థలాలను కబ్జా చేసిన వారిపై తెలంగాణ ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి.

కమర్షియల్ షట్టర్ల సీజ్: రెసిడెన్షియల్ కాలనీలో అక్రమంగా కొనసాగుతున్న వ్యాపార దుకాణాలను వెంటనే సీజ్ చేసి, అదనపు నిర్మాణాలను కూల్చివేయాలి.ప్రోత్సహించే నాయకులపై చర్యలు: ఆక్రమణదారుల వెనుక ఉండి చక్రం తిప్పుతున్న స్థానిక నాయకులు, ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

జీం9 టవర్లతో సమగ్ర పునరాభివృద్ధి సాధ్యం:
కూకట్‌పల్లి, ఖైత్లాపూర్ పరిసరాల్లో చదరపు గజం భూమి ధర మార్కెట్లో రూ.2 లక్షలకు పైగా పలుకుతోంది. ఇంతటి విలువైన పట్టణ భూమిని ఆక్రమణదారుల చేతుల్లో వదిలేయడం కంటే, ప్రభుత్వం సమగ్ర పునరాభివృద్ధి (Redeve lopment) చేపట్టాలి.
జీం9 హైరైజ్ టవర్లు: బలహీనపడిన పాత జీం2 భవనాల స్థానంలో అత్యాధునిక మౌలిక వసతులతో కూడిన జీం9 లేదా జీం10 టవర్లను నిర్మించాలి.
అర్హుల రక్షణ: ప్రస్తుతం ఉన్న అసలైన లబ్ధిదారులకు కొత్త ఫ్లాట్లను ఉచితంగా కేటాయిస్తూనే, తాత్కాలిక పునరావాసానికి అద్దె అలవెన్స్ ఇవ్వాలి.
మరిన్ని కుటుంబాలకు ఇళ్లు: వర్టికల్ గ్రోత్ వల్ల మిగిలే స్థలంలో అదనపు టవర్లు కట్టి, హైదరాబాద్‌లో ఇళ్లు లేని వందలాది మంది నిరుపేదలకు పక్కా ఇళ్లను అందించవచ్చు.ప్రజా ఆస్తుల పరిరక్షణ, అర్హులైన పేదలకు గృహ హక్కు కల్పన ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలి. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి, జీం9 పునరాభివృద్ధి ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే పరిశీలించాలి.





ఆక్రమణకు గురైన ఉమ్మడి అవసరాలకు భవిష్యత్ ఉపయోగాలకు కేటాయించిన స్థలం.

8వ తేదీన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి...
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి...
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్...
- మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంపై అధికారులతో అదనపు కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్...



రాజన్న సిరిసిల్ల,
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 8వ తేదీన జిల్లాలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 8వ తేదీన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహణపై జిల్లాలోని ఎంపీడీవో లు, హౌసింగ్ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తయిన ఇళ్ల ముందు గోడలపై "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" అనే లోగో స్టిక్కర్‌ను అతికించాలని, లబ్ధిదారుల వివరాలను రాయాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి ఎదుట లబ్ధిదారుల కుటుంబ సభ్యులందరితో కలిసి దీపం వెలిగించి, 'ఇందిరమ్మ ఇళ్లు' (మొబైల్ యాప్ ద్వారా ఫోటో తీసి, లబ్ధిదారులు లేదా వారి కుటుంబ సభ్యుల సోషల్ మీడియా ఖాతాల్లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామాల. పంచాయతీ కార్యదర్శి/ మున్సిపాలిటీల్లో వార్డు అధికారి ద్వారా, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఫోటోలను తీసి, సోషల్ మీడియా ఖాతాల్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ/ మున్సిపాలిటీల్లో ఇల్లు నిర్మించకముందు.. నిర్మించిన తర్వాత ఉన్న స్థితిని చూపేలా ఒక ఫ్లెక్సీని తయారు చేసి, అందరికీ కనిపించేలా ప్రముఖ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో పూర్తిగా పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ, ఆయా శాఖల అధికారులు ఇందిరమ్మ గృహ కమిటీలతో సమన్వయం చేసుకుని, పూర్తయిన ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఇంచార్జి హౌసింగ్ పీడీ సాజిద్ తదితరులు ఉన్నారు.

తెలుగు సాహిత్యానికి కపిలవాయి లింగమూర్తి చేసిన సేవలు చిరస్మరణీయం

- 70కి పైగా గ్రంథాలు.. శతాధిక రచనలతో సాహితీ రంగంలో విశిష్ట గుర్తింపు...
- కపిలవాయి లింగమూర్తి 8వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...



వేములవాడ,
పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు కపిలవాయి లింగమూర్తి తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. కపిలవాయి లింగమూర్తి 8వ వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కపిలవాయి లింగమూర్తి పద్య రచనతో ప్రారంభమైన తన సాహితీ ప్రస్థానాన్ని కథలు, విమర్శలు, జానపద సాహిత్యం, దేవాలయాలు, స్థలచరిత్రలపై పరిశోధనల వరకు విస్తరించారని తెలిపారు. 70కి పైగా గ్రంథాలు ప్రచురించడంతో పాటు శతాధిక రచనలు చేసి 'నడిచే విజ్ఞాన సర్వస్వం'గా గుర్తింపు పొందారని కొనియాడారు. ఉర్దూ మాధ్యమంలో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. తెలుగు పట్టా పొందారని తెలిపారు. 1954 నుంచి 1983 వరకు నాగర్‌కర్నూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారని పేర్కొన్నారు. 2014లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారని గుర్తుచేశారు. 'కవి కేసరి', 'కవితా కళానిధి', 'వేదాంత విశారద', 'గురు శిరోమణి' వంటి పలు బిరుదులు పొందిన కపిలవాయి.

మేకల రవి కుటుంబానికి చాడా పరామర్శ

ప్రజా ఉద్యమాలకు ఆయన సేవలు చిరస్మరణీయం





వరంగల్, నవంబర్ 6 సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మేకల రవి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, జిల్లా ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం శివనగర్‌లోని మేకల రవి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మేకల రవి తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం, భూ పోరాటాలతో పాటు ప్రజా సమస్యలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగీ ఏలేంధర్, గుండె బద్రి, అక్కపెల్లి రమేష్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు యాకాంబ్ర చారి, రాచర్ల రాజేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మేకల రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పసరహై స్కూల్ విద్యార్థుల జయభేరి.



గోవిందరావుపేట, నవంబర్ మండల పరిధి వాసరా నాగారం జడ్పీఎస్ఎస్ పాఠశాల హైస్కూల్ విద్యార్థులు హైదరాబాద్ జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడల్లో పాఠశాల విద్యార్థులు
జాడి హర్షిత్, కోకిల శివ,ములుగు జిల్లా తరపున కబడ్డీ పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు, హర్షిత్,
శివకు పిడి కవిత మేడం గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు,

ప్రింటర్స్ సొసైటీ సభ్యులకు దీపావళి వెండి కానుకధనత్రయోదశి సందర్భంగా 50 గ్రాముల వెండి నాణేల పంపిణీ



హనుమకొండ, నవంబర్ 6 దీపావళి పండుగను పురస్కరించుకుని హనుమకొండ ప్రింటర్స్ సొసైటీ సభ్యులకు 50 గ్రాముల వెండి నాణేలను కానుకగా అందజేశారు. ధనత్రయోదశి సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాటేటి సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సభ్యులకు ఇదేవిధంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. సభ్యుల ఐక్యతతో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నీలం రాజు, కోశాధికారి వెంకటరావు, ఉపాధ్యక్షులు ఓరుగంటి అశోక్, వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు తెలుకల రాజేందర్ రెడ్డి, ఓరుగంటి రవి కుమార్, కుసుమ రాజేందర్, బాలరాజు పాల్గొన్నారు. సభ్యులు అన్న సతీశ్, మహేందర్ రెడ్డి,

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

కొండపర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



హనుమకొండ, నవంబర్ 6 ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా కేంద్రంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌లో మందుల నిల్వలు, పంపిణీ రికార్డులు, నిర్వహణ తీరును తనిఖీ చేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.
అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. మాతాశిశు ఆరోగ్య సేవలు, సాధారణ టీకాలు, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, టీబీ ముక్త్ భారత్, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణతో పాటు దోమలు తదితర వాహకాల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.
ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని, ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి, సిబ్బందికి సూచించారు.

2వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుమలత.



గోవిందరావుపేట, నవంబర్ 6 మండల పరిధిపసర నాగారం గ్రామపంచాయతీ లో ని 2వ వార్డు లో శుక్రవారం రేషన్ షాపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ భూక్యసమలత పంపిణీ చేయడం జరిగ.ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా సుమలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా రేషన్ సరుకులు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు.
అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రేషన్ షాప్ నిర్వాహకులు ముద్దబోయిన విమల కాంగ్రెస్ నాయకులు గొంది కిరణ్, జక్కు రణదీప్ గౌడ్ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు,

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
-ఆకస్మిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



మొగుళ్ళ పల్లి, నవంబర్ 6 ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్, చిట్యాల సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్



భూపాలపల్లినవంబర్ 6: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సేవలను మెరుగుపరుస్తూ, సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిజేరియన్ ప్రసవాలపై జీజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ రాజేష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. సిజేరియన్ ప్రసవాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని, వైద్యపరమైన అవసరాన్ని బట్టి సిజేరియన్ శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. మొదటి కాన్పులోనే సిజేరియన్ జరిగిన కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. నవజాత శిశువులకు హెపటైటిస్--బి నివారణ టీకాలను నిర్ణీత సమయంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
ప్రసూతి సేవల నాణ్యత పెంపునకు వైద్యులు, గైనకాలజిస్టులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.
సమావేశంలో పీవో ఎంసీహెచ్ డాక్టర్ శ్రీదేవి, పీవో ఎన్‌సీడీ డాక్టర్ దేవేందర్, పీవో ఎన్‌టీఈపీ డాక్టర్ సందీప్, గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి, ప్రొఫెసర్లు, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత హక్కుపట్టా భూముల లీసర్వేకు శ్రీకారం.

మచ్చాపూర్ సర్పంచ్ ప్రభాకర్.



గోవిందరావుపేట, నవంబర్ 6(మండల పరిది
మచ్చాపూర్ గ్రామంలో శుక్రవారం
భూములను రీసర్వే ఎటువంటి అవకతవక లేకుండా పారదర్శకంగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వేలో డ్రైవ్ చేయడం జరిగింది సర్పంచ్ జంపాల ప్రభాకర్ తెలిపారు, ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ సర్వే లో ,ఏడి కిషన్ ప్రసాద్, డిఐ గుణవత్ రావు ఎమ్మార్వో కుసుమ రవీందర్,ఆర్ ఐ నూతన్ రీ సర్వే ఏ విధంగా జరుగుతుందని తెలుసుకోవడం జరిగిందన్నారు, గ్రామంలోని భూములు కాలువలు చెరువులు మరియు రైతులు భూము ల స రి హద్దులు ప్రతి ఒక్కటి స్పష్టంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా
ఏడి కిషన్ ప్రసాద్ మాట్లాడుతూ
రైతులకు భూముల హద్దుల విషయంలో ఎలాంటి వివాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా చూడటం మరియు ఒకరి భూమి మరొకరికి వెళ్లకుండా పక్కాగా హద్దులు నిర్ధారించడం. ఆధునిక సాంకేతికత డీజీపీఎస్, రోవర్లు మరియు జీఐఎస్ సాంకేతికతను ఉపయోగించి పాత రికార్డులతో సరిపోల్చుతూ భూముల సర్వే చేస్తున్నామ ని తెలిపారు,
మూడు దశల్లో రాష్ట్రంలో సమగ్ర భూ రీసర్వేను3దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు,మొదటి దశలో మచ్చాపూర్ గ్రామాల్లో ఈ సర్వే కొనసాగుతోందని రైతులకు సమాచారం సర్వే చేపట్టే ముందు భూ యజమానులకు ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. హెచ్చుతగ్గులు గుర్తిస్తే నోటీసులు జారీ చేసి, అభ్యంతరాలను పునఃపరిశీలిస్తున్నారు. భూభారతి పోర్టల్ సర్వే పూర్తయిన తర్వాత భూముల హద్దుల వివరాలను 'భూభారతి' పోర్టల్‌లో నమోదు చేస్తున్నమన్నారు,ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో మాట్లాడి ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, డ్రై ల్యాండ్స్, వెట్ ల్యాండ్స్ గుర్తింపు, భూముల మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మార్వో కుసుమ రవీందర్
మాట్లాడుతూ రీ-సర్వే సమయంలో భూముల సరిహద్దుల గుర్తింపు ప్రక్రియలో రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. భూ హద్దులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు లేదా సందేహాలు ఉంటే వాటిని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సర్వే వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకుంటూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారుజారీ చేస్తామని, నోటీసులు అందుకున్న రైతులకు నిబంధనల ప్రకారం 60 రోజుల వ్యవధిలో అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

సముద్రంలో మునిగిన చెన్నై సోనా బోటు



ఒంగోలు సబర్బన్/ఒంగోలు టౌన్/ చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నై హార్బర్‌కు చెందిన సోనా బోటు ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరానికి సమీపంలో సముద్ర జలాల్లో ప్రమాదానికి గురైంది. మురసు తుపాను తాకిడికి కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో 9 మంది మత్స్యకారులు మరణించినట్టు అనుమానిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని సముద్ర తీరానికి 4 మృతదేహాలు చేరగా.. మిగిలిన ఐదుగురి ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్ బృందాలు గాలిస్తున్నాయి. గురువారం కొత్తపట్నం సముద్ర తీరంలో మూడు మృతదేహాలు, మండలంలోని పిన్నివారిపాలెం తీరానికి మరో మృతదేహం కొట్టుకొచ్చాయి.

స్థానిక మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఆర్డీవో టి.చంద్రశేఖర్ రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి కొత్తపట్నం సముద్ర తీరానికి చేరుకున్నారు. చెన్నై మత్స్య శాఖ, చెన్నై హార్బర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. గత నెల 29న చెన్నై హార్బర్ నుంచి కూడిన మూడు సోనా బోట్లలో మత్స్యకార బృందాలు సముద్రంలో చేపల వేటకు బయల్దేరాయి. వీటిలో రెండు రామాయపట్నం పోర్టులో ఆగిపోయాయి. మరోబోటు ప్రమాదానికి గురై మునిగిపోయింది.

ఇక ప్రమాదానికి గురైన వారిలో చెన్నై రాయపురానికి చెందిన పక్కిరి సామి (49), రాయపురం వాషర్‌మెన్ పేటకు చెందిన కుప్పం మనోహరన్ (40), రాయపురానికే చెందిన మోహన్ (47), చెన్నై తిరువత్తియూర్‌కు చెందిన రాజేష్ (52), తోండియర్ పేటకు చెందిన మురుగన్ (48), రాయపురానికి చెందిన కుప్పుస్వామి (58), తిరువత్తియూర్‌కు చెందిన విజయ్‌కాంత్ (44), తోండియర్‌కు చెందిన అరవింద్ (40), కడలూరుకు చెందిన నారాయణన్ (57)గా గుర్తించారు. మరోవైపు.. లభ్యమైన మృతదేహాలను తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్. మేరీ విల్సన్ గురువారం రాత్రి పరిశీలించారు.

ఆ ఏడు కేసులను ఎందుకు మూసేశారు?



అమరావతి: అప్పటి ప్రభుత్వ పెద్దలు నారా చంద్రబాబు నాయుడు, పొంగూరు నారాయణ, పలువురు మంత్రులు, అధికారులపై దాఖలైన స్కిల్ డెవలప్‌మెంట్‌సహా ఏడు కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్)లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఏడు కేసులను 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' అంటూ మూసివేస్తూ సీఐడీ దాఖలు చేసిన నివేదికలకు సంబంధించిన వివరాలను కేసుల వారీగా పొందుపరిచి సమగ్ర పట్టికను సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

ఆయా కేసుల్లో ఫిర్యాదుదారుల వైఖరి, క్లోజర్ రిపోర్టుల దాఖలు, వాటి ఆమోదం, ప్రొటెస్ట్ పిటిషన్ల వివరాలను కేసుల వారీగా సమగ్ర పట్టిక రూపంలో తమ ముందు ఉంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ వివరాలతోపాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా సమర్పించాలని స్పష్టంచేసింది. వాటి ప్రతులను పిటిషనర్ తరఫు న్యాయవాదికి అందించాలని కూడా నిర్దేశించింది. క్లోజర్ రిపోర్టులను సవాలు చేస్తూ ప్రొటెస్ట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు సంబంధిత కోర్టు వాటిని పరిశీలించవచ్చని ధర్మాసనం స్పష్టంచేసింది. కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వస్తువులు, కీలక ఆధారాలను పరిరక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేస్తే సంబంధిత న్యాయస్థానం పరిశీలిస్తుందని కూడా సూచించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసిన ప్రధాన న్యాయమూర్తి (సీజే)జస్టిస్ లీసా గిల్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, అసైన్డ్ భూములు, ఏపీ ఫైబర్‌నెట్, మద్యం, ఇసుక విధానాలకు సంబంధించి దాఖలైన కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీలకు అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను ధర్మాసనం గురువారం విచారించింది.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ 2023లో పిల్ దాఖలు చేశారు. అలాగే చంద్రబాబు తదితరులపై వివిధ ఆర్థిక నేరాలకు సంబంధించి నమోదైన ఏడు కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీలకు బదిలీ చేయాలని కోరుతూ స్వర్ణాంధ్ర తెలుగు డైలీ ఎడిటర్ కె.బాలగంగాధర్ తిలక్ 2024లో పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

ఓటర్ల జాబితాలో పేరు లేదా?.. గుడ్ న్యూస్ చెప్పిన ఎన్నికల సంఘం..

ఢిల్లీ: ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం భారీ ఊరటనిచ్చింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా.. తుది జాబితాలో చోటు దక్కించుకునేందుకు మరో అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాలతో గైర్హాజరు, ఇల్లు మారడం, మరణం, డూప్లికేట్ ఓటరు ఐడీ వంటి కారణాలతో ఏఎస్‌డజాబితాలో పడి ఓటు గల్లంతైన వారికి ప్రయోజనం చేకూరనుంది.ఈ సందర్భంగా గైర్హాజరైనవారు, ఇల్లు మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి జాబితాలను మరోసారి పరిశీలించాలని సీఈఓలను ఈసీ ఆదేశించింది. ఈ జాబితాలను పోలింగ్ బూత్‌లు, పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో మరోసారి ప్రదర్శించాలని సూచించింది. అలాగే, రాష్ట్ర పరిధిలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న ఓటర్లకు ఈసీ ప్రత్యేక అవకాశం కల్పించింది. అలాంటి వారు ఫారం-8 సమర్పించకుండానే ఎన్యూమరేషన్ ఫారం, చిరునామా ధ్రువీకరణ పత్రంతో ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి పాత ఓటరు గుర్తింపు కార్డు (జ్రూ×జ) నంబర్ ఆధారంగా జుజ×చీజు యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం లభించనుంది.

మరోవైపు, ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ) రాజకీయ పార్టీల ఏజెంట్లతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్ల నుంచి అవసరమైన ఫారాలను సేకరించి, వారి పేర్లు తుది జాబితాలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మొత్తంగా,



ముసాయిదా జాబితాలో పేరు కనిపించలేదని ఓటు హక్కుపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో ఉండేలా చూసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

ఏపీ విపత్తు నిర్వహణ భేష్..

ప్రభుత్వ పనితీరుపై కేంద్రం ప్రశంసలు



అమరావతి, నవంబరు 6: 'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌ల విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కార్ సేవలు భేష్‌గా నిలిచాయని కేంద్ర బృందం ప్రశంసలు కురిపించింది. తుఫాన్‌లపై సకాలంలో బాధితులకు అందించిన సేవలకు గానూ రాష్ట్ర ప్రభుత్వ తీరును కేంద్ర బృందం అభినందించింది. అయితే, 'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌లు ఒకే వారంలో విరుచుకుపడటంతో 20 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు.. ప్రకృతి బీభత్సాన్ని దీటుగా ఏపీ ప్రభుత్వం ఎదుర్కొంది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ముందస్తు వ్యూహాలతో పెనుముప్పు తప్పింది.. ఆపదలో రాష్ట్రాన్ని సురక్షిత నాయకత్వం ఆదుకుంది. విపత్తు నిర్వహణలో దేశానికే ఆదర్శంగా ఏపీ నిలించింది. తుఫాన్‌ల ప్రభావంతో కనిష్ఠ స్థాయికి ఆస్తి, ప్రాణనష్టం వచ్చింది. ప్రాణ రక్షణ కవచాల్లాగా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ూూూణహీూ), ఆర్టీజీఎస్ అధికారులు (=+ూ) పనిచేశారు. కంట్రోల్ రూమ్ నుంచి 24/7 తుఫాన్‌ల పర్యవేక్షణ.. కచ్చితమైన అంచనాలతో యంత్రాంగం అప్రమత్తమైంది.

ఏఐ, శాటిలైట్ సమాచారంతో ఫోన్లకు హెచ్చరికలను ఏపీ సర్కార్ జారీ చేసింది. 'మనమిత్ర' వాట్సాప్ యాప్‌తో సత్వర సహాయం అందజేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు శాఖల సమన్వయం ద్వారా లక్షలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలించింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు సర్కార్ అండగా నిలిచింది. నిరంతరాయంగా ఆహారం, తాగునీరు, వైద్యం అందజేసింది. రికార్డు వ్యవధిలో రాకపోకలను పునరుద్ధరించింది. అధికారుల సమష్టి కృషితో వేగంగా సాధారణ స్థితికి జనజీవనం వచ్చింది.

తగ్గనున్న ట్రైన్ టికెట్ ధరలు.. కొత్త రూల్స్ వస్తున్నాయ్!

రైలు ప్రయాణం చేసేవారికి శుభవార్త. ఎందుకంటే.. 2027 జనవరి నుంచి టికెట్ ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ రేట్లు ఎందుకు తగ్గనున్నాయి?, ఎంత తగ్గనున్నాయి?, అనే విషయాలను ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.

2027 జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా 40కి పైగా రైళ్లకు సూపర్‌ఫాస్ట్ హోదా తొలగించి, వాటిని సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా నడపనున్నట్లు తెలుస్తోంది. జాబితాలో.. మహానగరి, ప్రగతి, తులసి, సప్త క్రాంతి వంటి ప్రముఖ రైళ్లు కూడా ఉన్నాయి. ఈ మార్పుల వల్ల ప్రయాణికులకు టికెట్ ధరలు తగ్గే అవకాశం ఉంది. కొన్ని రైళ్ల నంబర్లు కూడా మారనున్నట్లు సమాచారం.


సూపర్‌ఫాస్ట్ హోదా ఇవ్వాలంటే

సాధారణంగా ఒక రైలుకు సూపర్‌ఫాస్ట్ హోదా ఇవ్వాలంటే.. కొన్ని నిబంధనలు ఉంటాయి. బ్రాడ్‌గేజ్ మార్గంలో రైలు తన పూర్తి ప్రయాణంలో గంటకు సగటున కనీసం 55 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. రెండు దిశల్లోనూ ఈ ప్రమాణాన్ని అందుకోవాల్సి ఉంటుంది. కానీ.. ఇటీవల రైల్వే శాఖ నిర్వహించిన సమీక్షలో కొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఈ వేగాన్ని అందుకోవడం లేదని గుర్తించినట్లు బిజినెస్ టుడే నివేదించింది.

దీనికి ప్రధాన కారణాలు.. రైలుకు మధ్యలో అదనపు స్టాపులు పెరగడం, రైల్వే ట్రాక్‌లపై రద్దీ ఎక్కువగా ఉండటం, కొన్ని ప్రాంతాల్లో సింగిల్ లైన్ మార్గాలు ఉండటం అని తెలుస్తోంది. దీంతో సూపర్‌ఫాస్ట్ ప్రమాణాలను అందుకోలేని రైళ్లకు ఆ హోదాను తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈ రైళ్లపై ప్రభావం

ఈ ప్రభావం ఏయే రైళ్లపై పడనుంది అనే విషయానికి వస్తే.. సెంట్రల్ రైల్వే పరిధిలో మొత్తం 18 రైళ్లు ఈ జాబితాలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇందులో.. ముంబై సీఎస్ఎంటీ



నుంచి పూణే వెళ్లే ప్రగతి ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్ టెర్మినస్ నుంచి అయోధ్య కాంట్ వెళ్లే తులసి ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలో 20 రైళ్లకు సూపర్‌ఫాస్ట్ హోదా తొలగించే అవకాశం ఉంది. ఇందులో.. సప్త క్రాంతి ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఉత్తరాఖండ్ ప్రాంతానికి చెందిన మరో ఎనిమిది రైళ్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. తనక్‌పూర్-ఢిల్లీ, డెహ్రాడూన్-కాశీగోదాం రైళ్లు కూడా ఇందులో ఉన్నాయి. వీటితో పాటు గోవా ఎక్స్‌ప్రెస్ పేరు కూడా ఈ జాబితాలో కనిపిస్తోంది.

రాజ్యాంగానికి రక్షణ ఎక్కడ?: కాకాణి సంచలన ఆరోపణలు



నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధికార కూటమి అరాచకాలకు పాల్పడిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు.. ప్రజలను కాపాడాల్సిన పోలీసులతోనే పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని వారు మండిపడ్డారు.ఏపీలో పరిషత్ ఎన్నికలు జరిగిన విధానంపై, ఆ సమయంలో పోలీసులు ప్రవర్తించిన దారుణమైన తీరుపై.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా పార్టీ శ్రేణులను నిర్బంధించారని, ప్రధాన నాయకులను హౌస్ అరెస్టులు చేయగా, కొందరు నేతలను గ్రామాల నుంచి వెళ్లగొట్టారని, ఈ పరిస్థితి చాలా దారుణమని అన్నారు. నెల్లూరు జిల్లాలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, గాయపడిన వారిని సైతం తరిమికొట్టారని వారు విమర్శించారు. మంత్రిగా ఉన్న ఆనం పోలింగ్ కేంద్రాల వద్దకు ఎలా వెళ్తారని వారు ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలే స్వయంగా వెళ్లి బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడ్డారు. అలాగే, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన చోట పోలింగ్ రద్దు చేయకపోవడంపై కలెక్టర్‌ను నిలదీస్తున్నానని కాకాణి అన్నారు.మర్రిపాడులో ఎస్ఐ బలరాం, సీఐ గంగాధర్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంతోపాటు.. టీడీపీకి చెందిన వారు గూడూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గురవయ్య ఇంటిపై దాడికి యత్నించారని వారు ఆరోపించారు. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తరిమికొట్టడం, పోలీస్‌స్టేషన్‌కు తరలించిన తీరు సరికాదని మండిపడ్డారు.



హైబీపీ ఎంత ఉందో లెక్కించాలంటే ఒక్కసారి రీడింగ్ సరిపోదు .. మరి ఏం చేయాలి..?

। రక్తపోటు (హైబీపీ) గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. అయినప్పటికీ చాలామంది సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్ష చేయించుకునే సమయంలో మాత్రమే రక్తపోటును పరీక్షించుకుంటారు. అయితే ఒక్కసారి తీసిన బీపీ రీడింగ్‌పై మాత్రమే ఆధారపడటం సరైన నిర్ణయం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తపోటు అసలు స్థాయిని తెలుసుకోవాలంటే క్రమం తప్పకుండా కొలవడం అవసరమని సూచిస్తున్నారు. ఆసుపత్రి లేదా వైద్యుల క్లినిక్‌లో కొలిచే రక్తపోటు కొన్నిసార్లు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. దీనికి ప్రధాన కారణం వైట్ కోట్ సిండ్రోమ్. కొంతమంది ఆసుపత్రి వాతావరణంలో ఆందోళన, భయం లేదా ఒత్తిడికి గురవుతారు. ఈ మానసిక ఒత్తిడి కారణంగా తాత్కాలికంగా రక్తపోటు పెరిగి, సాధారణం కంటే ఎక్కువ రీడింగ్ నమోదయ్యే అవకాశం ఉంటుంది.ఇలా చేయాలి..

ఈ కారణంగా సంవత్సరానికి ఒకసారి తీసిన ఒక్క రీడింగ్ ఆధారంగా ఆరోగ్య నిర్ణయాలు తీసుకోవడం కంటే, ఇంట్లోనే క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల నిజమైన సగటు రక్తపోటు స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం 2-2-7 పద్ధతిని అనుసరించాలని సూచిస్తున్నారు.

రోజూ మనం వాడే టూత్‌పేస్టులతో క్యాన్సర్ వస్తుందా..



। దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రోజువారీగా ఉపయోగించే అనేక వస్తువులపై భయాలు, అపోహలు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. అలాంటి వాటిలో టూత్‌పేస్ట్ కూడా ఒకటి. టూత్‌పేస్ట్‌లో ఉండే కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమవుతుందనేది పూర్తిగా అపోహ మాత్రమేనని చెబుతున్నారు. ఈ అపోహకు కారణం ఒకేలా వినిపించే రెండు వేర్వేరు రసాయనాలను గందరగోళానికి గురి చేయడమేనని వివరిస్తున్నారు. చాలా టూత్‌పేస్ట్‌లలో సోడియం లారిల్ సల్ఫేట్ అనే పదార్థం ఉంటుంది. ఇది టూత్‌పేస్ట్‌లో నురుగు ఏర్పడటానికి, దంతాలను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. అయితే కొందరు దీనిని సోడియం లారెత్ సల్ఫేట్‌తో పొరపాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ూజూ తయారీ ప్రక్రియలో ఏర్పడే కొన్ని ఉప ఉత్పత్తులు విషపూరిత ప్రభావాలకు సంబంధించిన చర్చల్లో ఉంటాయి. ఈ రెండు రసాయనాల పేర్లు ఒకేలా ఉండటంతోనే టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమనే అపోహ వ్యాపించిందని అంటున్నారు.

క్యాన్సర ప్రమాదం ఉంటుందా..

వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కొంతమందిలో ఇది నోటి లోపలి పొరను స్వల్పంగా చికాకు పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తరచూ నోటి పుండ్లు రావడం, నోటి లోపలి చర్మం అత్యంత సున్నితంగా ఉండటం లేదా దంతాలను తోమేటప్పుడు మంటగా అనిపించడం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. ఇలాంటి సమస్యలు ఎదురయ్యే వారు ూూ లేని టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే అసౌకర్యం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి సున్నితత్వం లేని వారిలో ూూ సాధారణంగా సురక్షితంగానే ఉంటుంది.

పరిశ్రమల్లో వినియోగించినా..

కొంతమంది ూూ పరిశ్రమల్లో కూడా ఉపయోగించే రసాయనం కాబట్టి అది ప్రమాదకరమని భావిస్తుంటారు. అయితే ఒక పదార్థాన్ని పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారనే కారణంతోనే అది మన ఆరోగ్యానికి హానికరమని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మనం ప్రతిరోజూ ఉపయోగించే నీరు కూడా అనేక పరిశ్రమల్లో వినియోగిస్తారని, కాబట్టి ఒక పదార్థం పారిశ్రామిక వినియోగంలో ఉందనే ఒక్క కారణంతో దానిని విషపూరితమని భావించడం సరైన విధానం కాదని పేర్కొంటున్నారు. అలాగే ప్రతి టూత్‌పేస్ట్ అందరికీ ఒకేలా సరిపోదని నిపుణులు చెబుతున్నారు. దంతాలు, చిగుళ్ల సున్నితత్వం, నోటి ఆరోగ్య పరిస్థితులను బట్టి టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవడం మంచిదని, అవసరమైతే దంతవైద్యుడి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారం ప్రమాదమో తెలుసా..

తెలియదంటే ఇప్పుడు తెలుసుకోండి..!



ఆరోగ్యానికి సమతుల ఆహారం పునాది లాంటిదని అందరికీ తెలుసు. అయితే మనం తీసుకునే ప్రతి ఆహారం అందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపదు. కొన్ని రకాల ఆనారోగ్య సమస్యలు (ఎఘశ్రీశ్రీష్ట్ర ×ంంబవం) ఉన్నప్పుడు ఆరోగ్యకరమైనవిగా భావించే ఆహారపదార్థాలు కూడా హాని కలిగించవచ్చు. వ్యాధిని బట్టి ఆహార నియమాలను జాగ్రత్తగా పాటించడం చికిత్సలో ఒక కీలకమైన భాగంగా వైద్యులు సూచిస్తున్నారు. సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు. మరి ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారాలు తీసుకోకూడదో ఇప్పుడు తెలుసుకుందాం..మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారు స్వీట్లు, చక్కెర పానీయాలు, మైదా ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగవంతంగా పెంచుతాయి. అధిక రక్తపోటు బాధితులు ఉప్పు, ప్యాకేజ్డ్ స్నాక్స్, ఊరగాయలు వంటి సోడియం అధికంగా ఉండే పదార్థాలను మానుకోవాలి. లేదంటే శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు మరింత పెరిగే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు ఉన్నవారు డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇక కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు పాలకూర, రాగులు, జీడిపప్పు, డార్క్ చాక్లెట్ వంటివి తినకపోవడమే మంచిది. వీటిలోని ఉండే ఆక్సలేట్లు కాల్షియంతో కలిసి రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు రెడ్ మీట్, కొన్ని రకాల సముద్ర చేపలు, మద్యానికి దూరంగా ఉండాలి. వీటిలోని ప్యూరిన్లు శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచి కీళ్ల నొప్పులు, వాపులకు దారితీస్తాయి.



ప్రసవానంతరం మహిళలు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి..

జెశీఎవఅ । ప్రసవం తర్వాత మహిళ శరీరం పూర్తిగా కోలుకోవడానికి, అలాగే శిశువుకు తల్లిపాలు అందించడానికి సరైన పోషకాహారం అత్యంత కీలకం. గర్భధారణ సమయంలో పోషకాహారంపై ఎంత శ్రద్ధ అవసరమో, ప్రసవానంతరం కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీర పునరుద్ధరణ వేగవంతమవడంతోపాటు శక్తి పెరుగుతుంది, తల్లిపాల ఉత్పత్తికి కూడా మేలు జరుగుతుంది. ప్రసవం తర్వాత శరీరం తీవ్రమైన శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ అయినా శరీరానికి కోలుకునే సమయం అవసరం. ఈ సమయంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణ, గాయాలు త్వరగా మానడం, శరీర కణజాలం మరమ్మత్తు కావడంలో సహాయపడుతుంది. గుడ్లు, పనీర్, పప్పులు, టోఫూ, చికెన్ వంటి ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం మంచిది.

ఐరన్, క్యాల్షియం ఉండే ఆహారాలు..

ప్రసవ సమయంలో రక్తనష్టం జరగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే శరీరంలోని ఐరన్ నిల్వలను పునరుద్ధరించేందుకు పాలకూర, బీట్‌రూట్, బెల్లం, ఖర్జూరం, లీన్ మీట్ వంటి ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. దీంతో రక్తహీనత ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి కొవ్వులు (హెల్తీ ఫ్యాట్స్) కూడా ప్రసవానంతర పోషకాహారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. డ్రై ఫ్రూట్స్, గింజలు, విత్తనాలు వంటి ఆహారాల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా హార్మోన్ల సమతుల్యతకు కూడా తోడ్పడతాయి. అలాగే ఎముకల ఆరోగ్యానికి పెరుగు, పాలు, నువ్వులు, రాగి వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ప్రసవం తర్వాత, ముఖ్యంగా తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తగినంత నీరు తాగడం చాలా అవసరం. శరీరంలో ప్రతి కణం సక్రమంగా పనిచేయడానికి, జీర్ణక్రియ మెరుగుపడడానికి, తల్లిపాల ఉత్పత్తి సక్రమంగా సాగడానికి హైడ్రేషన్ కీలకం. రోజుకు సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. సాధారణ నీటితోపాటు కొబ్బరి నీరు, మజ్జిగ, చికెన్ సూప్, పప్పు సూప్ వంటి పోషక విలువలు కలిగిన ద్రవాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు.. ప్రసవానంతరం రోజుకు మూడు పెద్ద భోజనాల కంటే తక్కువ మోతాదులో తరచూ ఆహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరానికి నిరంతరం శక్తి అందుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా తగ్గిపోవడాన్ని నివారించవచ్చు.

కీళ్ల క్షీణత సమస్య ఉంటే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి.. ఏం చేయాలి..?

నేలపై కాళ్లు మడిచి కూర్చోవడం, స్క్వాట్ చేయడం, మెట్లు ఎక్కడం లేదా దిగడం, ఎక్కువసేపు కూర్చున్న తర్వాత లేవడం, వంగి షూ లేసులు కట్టుకోవడం వంటి రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది కలుగుతోందా? చాలామంది వీటిని వయసు పెరగడం వల్ల వచ్చే సాధారణ సమస్యలుగా భావించి పట్టించుకోరు. అయితే ఇవి కీళ్ల క్షీణత (జాయింట్ డిజెనరేషన్) ప్రారంభ సంకేతాలు అవుతాయని ఆర్థోపెడిక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఈ సమస్యలు పెరుగుతున్నట్లు వారు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం, గతంలో వృద్ధాప్యంలో ఎక్కువగా కనిపించే మోకాళ్ల నొప్పి, వెన్ననొప్పి, కీళ్ల కదలికలు తగ్గడం వంటి సమస్యలు ఇప్పుడు మధ్యవయసు వారిలో కూడా సాధారణమవుతున్నాయి. కీళ్ల క్షీణత ఒక్కసారిగా తీవ్రమైన నొప్పితో ప్రారంభం కాదు. మొదట్లో స్వల్ప బిగుతు, కదలికల్లో అసౌకర్యం వంటి లక్షణాలతో నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. చాలామంది వీటిని బిజీ జీవనశైలి, వ్యాయామం లేకపోవడం లేదా వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేస్తారని నిపుణులు పేర్కొంటున్నారు.

ూ× అఅ ంజూశీతీం జఅఽవశీ 2ూ× అఅ ంజూశీతీం జఅఽవశీ 2

క్షీణతకు సంబంధించిన ప్రారంభ హెచ్చరిక సంకేతాల్లో నేలపై కాళ్లు మడిచి కూర్చోవడం లేదా స్క్వాట్ చేయడం కష్టంగా అనిపించడం, మెట్లు ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు నొప్పి లక్షణాలు కనిపిస్తాయి..

కీళ్ల క్షీణత సమస్య ఉంటే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి.. ఏం చేయాలి..?

రావడం, ఉదయం నిద్రలేచిన వెంటనే లేదా ఎక్కువసేపు కూర్చున్న తర్వాత కీళ్లు బిగుసుకుపోవడం, శరీర కదలికల్లో వశ్యత తగ్గడం, కీళ్ల చుట్టూ అప్పుడప్పుడు వాపు కనిపించడం, కదిలేటప్పుడు కీళ్లలో రాపిడి లేదా క్లిక్ శబ్దం వినిపించడం వంటి లక్షణాలు ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. ఈ లక్షణాలు తరచూ కనిపిస్తూ కొనసాగితే వాటిని నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. చాలామంది రోజువారీ పనులు చేయలేనంతగా నొప్పి పెరిగిన తర్వాత మాత్రమే వైద్యులను సంప్రదిస్తారని, అయితే ప్రారంభ దశలోనే సమస్యను గుర్తిస్తే కీళ్ల పనితీరును కాపాడుకోవడంతోపాటు మరింత క్షీణతను నివారించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అతని చేతిలో దారుణంగా మోసపోయా: రెజీనా



తెలుగు, తమిళ చిత్రాల్లో హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రెజీనా కసాండ్రా. తాజాగా ఈ నటి తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ సమయంలో పడిన మానసిక వేదన గురించి మాట్లాడారు.

'2020లో నా ప్రేమ బ్రేకప్ అయింది. ఆ బంధంలో నేను దారుణంగా మోసపోయా. నమ్మిన మనిషే వెన్నుపోటు పొడవడంతో నా మనసు ముక్కలైంది' అని రెజీనా పేర్కొన్నారు. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా కాలం పట్టిందని, ఆ సమయంలో తనకు ఎదురైన మానసిక వేదనను మాటల్లో చెప్పలేనని తెలిపారు.

ప్రేమించుకోవడం నేర్చుకున్నా..
'నా సమయాన్ని, నా ఆలోచనలను నాకోసమే కేటాయించుకోవాలని నిర్ణయించుకున్నాను. సరిగ్గా అదే సమయంలో కరోనా లాక్‌డౌన్ మొదలైంది. ఆ సమయం నాకు ఒక విధంగా వరంగా మారింది. బయటి ప్రపంచానికి దూరంగా ఉంటూ నన్ను నేను ప్రేమించుకోవడం నేర్చుకున్నాను. ఆ రోజుల్లో నాకు నేను ఇచ్చుకున్న ధైర్యమే ఈ రోజు నన్ను ఈ స్థాయి ప్రశాంతతకు చేర్చింది' అని రెజీనా వివరించారు.

కెరీర్‌లో కొత్త ప్రయోగాలు..
తెలుగులో 'శివ మనసులో శృతి', 'రొటీన్ లవ్ స్టోరీ', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్', 'ఎవరు' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన రెజీనా.. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల అజిత్ నటించిన తమిళ చిత్రం 'విదాముయర్చి'లో ప్రతినాయిక పాత్రలో కనిపించి మెప్పించారు. హీరోయిన్‌గా అలరించిన రెజీనా.. ఇప్పుడు ప్రతినాయిక పాత్రలతోనూ తన నటనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. అలా ఈ రోజు విడుదలైన నయనతార 'మహాశక్తి' మూవీలోనూ నెగిటివ్ రోల్‌లో ప్రేక్షకులను మెప్పించారు.

సినిమా న్యూస్

రామాయణం'పై డైరెక్టర్ శంకర్ ప్రశంసల వర్షం

తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'రామాయణం' చిత్రంపై సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికే డైరెక్టర్ రాజమౌళి, మహేశ్‌బాబు, సందీప్ రెడ్డి వంగా, విజయ్‌దేవరకొండ వంటి ప్రముఖులు ప్రశంసలు కురిపించగా ఇప్పుడీ జాబితాలోకి ప్రముఖ దర్శకుడు శంకర్ చేరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి

'భారతీయ సినిమాలో ఇలాంటి విజువల్స్‌ను ఇప్పటివరకు చూడలేదు. నమిత్ మల్హోత్రా, నితేశ్ తివారీ భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, గొప్ప నిర్మాణ విలువలు, మంచి రూపకల్పన, ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ అందించిన సంగీతం, భారీ సౌండ్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి' అని శంకర్ పేర్కొన్నారు.ఇక ఈ సినిమాలో యశ్ నటనపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. 'ప్రతి ఫ్రేమ్‌లో యశ్‌ను చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో ప్రేమించదగిన విలన్‌గా కనిపించారు. అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు' అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రణబీర్ కపూర్, సాయిపల్లవికి శుభాకాంక్షలు తెలిపారుకాగా రణబీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రామాయణ'. ఈ సినిమాకి నితేశ్ తివారీ దర్శకత్వం వహించారు. నమిత్ మల్హోత్రా నిర్మించిన ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించారు.



భారతీయుడు రాలిగా గర్విస్తున్నా..

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది. అయితే ఈ సినిమాలో శూర్పణఖ కీలక పాత్రలో నటించిన ప్రముఖ నటి రకుల్ ప్రీత్‌సింగ్ తాజాగా తన అనుభవాలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.భారతీయుల సంస్కృతికి ప్రతీక అయిన రామాయణ గాథను ఇంత భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో వెండితెరపై ఆవిష్కరించడం తన జీవితంలో మరువలేని అద్భుతమైన అనుభూతినిచ్చిందని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అద్భుతమైన సినిమాను అందించాలనే వారి తపన తనకెంతో స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.



'రామాయణ'పై మహేష్ బాబు ప్రశంసలు..

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా 'రామాయణం' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 'రామాయణ' పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 'రామాయణ' చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం 'వారణాసి' గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, టైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది.ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో 'వారణాసి'లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక 'రామాయణం' సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే



ట్రెండింగ్‌లో 'రామాయణం' మండోదరి..



టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ భారీ పౌరాణిక చిత్రం 'రామాయణం' తో బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఇక సినిమా విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కాజల్ అందం, అభినయం గురించిన చర్చలే ప్రధానంగా ట్రెండింగ్‌లో నిలిచాయి.పెళ్లి మరియు సెకండ్ ఇన్నింగ్స్ తర్వాత కూడా కాజల్ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. రాణి మండోదరి పాత్రలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ, వెండితెరపై ఒక ప్రత్యేకమైన ముద్ర వేశారు.

అప్పట్లో 'మగధీర' చిత్రంలో యువరాణిగా ప్రేక్షకులను అలరించిన కాజల్, ఈ పౌరాణిక చిత్రంలో మరింత పరిపక్వతతో కూడిన నటనను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంటున్నారు. కాజల్ స్క్రీన్ ప్రజెన్స్ మరియు ఆమె పాత్ర ప్రాధాన్యతపై సినిమా విడుదల తర్వాత పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ప్రభావితం చేసే అత్యంత కీలకమైన పాత్రలో ఆమె ఒదిగిపోయిన తీరు అందరినీ ఆకట్టుకుంది.